క్లుప్తంగా

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

కోడుమూరు రూరల్: గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ మన్సూరుద్దీన్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని ప్రజా సంఘాల నేతలు, వినాయక నిమజ్జన కమిటీ సభ్యులతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినం సందర్భంగా వినాయకులను ఆశీనులను చేసే మండపాలకు కమిటీ సభ్యులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. వినాయక మండపాల వద్ద కమిటీ సభ్యులు అందుబాటులో ఉండాలని, కరెంట్ లైన్లు, ఇతర ఏర్పాట్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి గొడవలకు తావు లేకుండా ప్రశాంతంగా విగ్రహాల ఊరేగింపు నిర్వహించుకోవాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఎస్‌ఐ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులు, ఈఓ అజయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

కోడుమూరు రూరల్: జగనన్న గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారులంతా త్వరగా నిర్మాణాలను చేపట్టాలని తహసీల్దార్ జయన్న సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ చంద్రశేఖర్, హౌసింగ్ డీఈఈ వాసుదేవరావుతో కలిసి మండలంలోని ప్యాలకుర్తి రైతు భరోసా కేంద్రంలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని, ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుంటే బిల్లులు కూడా మంజూరు చేస్తామన్నారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, హౌసింగ్ డీఈఈ వాసుదేవరావు మాట్లాడుతూ లబ్ధిదారులను చైతన్యం చేయాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సూచించారు. సమావేశంలో ఏపీఎం పుష్పావతి, హౌసింగ్ ఏఈ లక్ష్మన్న పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత




రేషన్ బియ్యంతో పట్టుబడిన లారీ

పాణ్యం: స్థానిక హైవేలో రేషన్ బియ్యంతో వెళ్తున్న లారీని విజిలెన్స్ అధికారులు పట్టుకొని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అశోక్ శుక్రవారం తెలిపారు. వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం కొలార్ జిల్లా పాగలి మండలానికి చెందిన ఆర్.ఉదయ్‌కుమార్, చింటన్న అనే వ్యక్తి సూచన మేరకు పాణ్యం సమీపంలోని గోరుకల్లు తాండాలో ఉన్న రేషన్ బియ్యంను కేఏ 53 బి 5678 నంబర్ గల లారీలో కర్ణాటకకు తరలిస్తున్నాడు. దీనిపై విజిలెన్స్ అధికారులకు సమాచారం అందడంతో హైవేలో లారీని పట్టుకుని సోదాలు చేశారు. లారీలో 207.60 క్వింటాళ్ల బియ్యంను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అధికారుల సూచనల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సబ్సిడీ శనగ విత్తనాల కేటాయింపు

కల్లూరు: మండలానికి 3,620 క్వింటాళ్ల శనగ విత్తనాలు కేటాయించినట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన నాయకల్లు గ్రామంలో పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. మండలంలో రబీ సీజన్‌లో ప్రధాన పంటగా శనగ పంట సాగు విస్తీర్ణం ఈ ఏడాది పెరగనుందన్నారు. శనగ విత్తనాలను ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో రైతులకు అందించనున్నట్లు తెలిపారు. శనగ విత్తనాలు కావాలసిన రైతులు రైతు భరోసా కేంద్రంలో వీఏఏ, వీహెచ్ఏలను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

'సుంకేసుల'కు నిలిచిన ఇన్‌ఫ్లో



సుంకేసుల జలాశయం

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు శుక్రవారం ఇన్‌ఫ్లో నిలిచిపోయింది. కేసీ కాల్వకు 189 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1.20 టీఎంసీలు కాగా ప్రస్తుతం పూర్తి స్థాయి నీటి మట్టం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

17న జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

మద్దికెర: ఈనెల 17వ తేదీన విద్యాసాయి హైస్కూలులో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి జిల్లా సూపర్ సెవెన్ క్రికెట్ బాలుర జట్టు ఎంపిక చేయనున్నట్లు క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి భాస్కర్ శుక్రవారం తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలన్నారు. వివరాలకు 63003 79835 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నిందితుల అరెస్ట్

ఆస్పరి: మండలంలోని ముత్తుకూరు గ్రామంలో బుధవారం పొలం తగాదా విషయంలో కురువ లక్ష్మన్న, సరోజమ్మ, అంజినమ్మపై దాడి చేసిన నిందితులు హనుమంతు, సురేష్, వెంకటేష్, చంద్రలను శుక్రవారం ముత్తుకూరులో అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

పొదుపు మహిళల ఆర్థిక విజయం

- ఓర్వకల్లు మహిళలు దేశానికే స్ఫూర్తిదాయకం
- రూ.10 లక్షలు విరాళం అందించిన 'తానా' ఫౌండేషన్ చైర్మన్ శశికాంత్
- 120 సంఘాలకు బ్యాంక్ లింకేజీ కింద రూ.12 కోట్ల రుణాలు పంపిణీ
- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



విరాళం చెక్కును అందజేస్తున్న శశికాంత్

ఓర్వకల్లు: గత 28 ఏళ్లుగా పొదుపు మహిళలు సాధించిన ఆర్థిక విజయాలు అభినందనీయమని, సంఘాల నిర్వహణ, ఐక్యతలో ఓర్వకల్లు మహిళలు దేశానికే ఆదర్శంగా నిలవడం గర్వించదగ్గ విషయమని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రశంసించారు. శుక్రవారం స్థానిక బాలభారతి పాఠశాల ఆవరణలో మండల మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమాఖ్య గౌరవ సలహాదారురాలు విజయభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే కాటసానితో పాటు, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాటసాని ఉమామహేశ్వరమ్మ, శివనరసింహారెడ్డి, తానా ఫౌండేషన్ చైర్మన్ శశికాంత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. 1995లో ఆవిర్భవించిన పొదుపు సంఘాలు దినదిన ప్రవర్ధమానంగా అభివృద్ధి చెందుతూ, ప్రపంచస్థాయికి ఎదగడం సంతోషించదగ్గ విషయమన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు స్వశక్తితో కార్పొరేట్ స్థాయిలో రూ.7 కోట్లతో బాలభారతి పాఠశాలను నిర్మించడం గర్వకారణమన్నారు. మహిళలను చైతన్య పరచడంతో పాటు, ఆర్థిక స్వావలంబన దిశగా నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తున్న విజయభారతికి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

పొదుపు మహిళల ఆర్థిక స్వాలంబన దిశగా అభయహస్తం, పావలా వడ్డీ పథకాలను అమలు చేసిన ఘనత దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి కే దక్కిందన్నారు. అదే స్ఫూర్తితో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదుపు మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. పొదుపు మహిళలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు బ్యాంకుల ద్వారా తీసుకున్న పొదుపు రుణాలను దశల వారీగా మాఫీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే వడ్డీలేని రుణాలు అందజేస్తూ ప్రోత్సహిస్తోందని చెప్పారు. అనంతరం సమాఖ్య గౌరవ సలహాదారురాలు విజయభారతి మాట్లాడుతూ.. పొదుపు సంఘాల ఆవిర్భావంలో ఒక్కో సభ్యురాలు కేవలం రూ.30తో మొదలుపెట్టి, ప్రస్తుతం రూ.500, రూ.1000 చొప్పున పొదుపు చేయడం హర్షణీయమన్నారు. 'తానా' ఫౌండేషన్ చైర్మన్ శశికాంత్ మాట్లాడుతూ, పొదుపు మహిళలు స్వశక్తిగా స్థాపించిన బాలభారతి పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయసహకారాలు అందజేస్తామని తెలుపుతూ రూ.10 లక్షలను విరాళంగా అందజేశారు. అనంతరం మహిళా సమాఖ్య సభ్యులు ఎమ్మెల్యే దంపతులను శాలువా, గజమాలతో సత్కరించారు. ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్ గౌడు, సింగిల్ విండో చైర్మన్లు నాగతిరుపాలు, చంద్రశేఖర్ రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా, ఏపీఎం వెంకటరామిరెడ్డి, సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు విజయలక్ష్మి, తాజ్‌మున్నీసా, సిబ్బంది. వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పొదుపు మహిళలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన గోనవరం గ్రామస్తులు

జగనన్నతోనే జనరంజక పాలన

పాణ్యం: జనరంజక పాలన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కాట సాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాణ్యం పార్టీ కార్యాలయం వద్ద గోనవరం గ్రామానికి చెందిన ప్రకాశం, మాలి ఉసేన్ ఆధ్వర్యంలో సుమారు 40 కుటుంబాలు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజలు మెచ్చేలా, వారికి ఏమి అవసరమవుతాయో తెలుసుకుని ఆయా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని కొనియాడారు. అలాంటి పాలనను మెచ్చి అభివృద్ధిని ఆకాంక్షించి పలువురు కార్యకర్తలు టీడీపీ వీడి వైఎస్సార్‌సీపీలోకి వచ్చారన్నారు. గోనవరం గ్రామంలో 40 కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్‌సీపీలో చేరడం సంతోషంచదగ్గ విషయమన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సూచించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. కష్టపడి పనిచేసిన ప్రతిఒక్కరికీ పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ పదవుల్లో 50 శాతం మహిళలకు కేటాయించారని గుర్తుచేశారు. రాయకీయ పదవులు, నామినేటెడ్ పదవుల్లో ఎలాంటి బేధాభిప్రాయం లేకుండా అందరికీ సమానంగా పదవులు కేటాయించినట్లు చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను కర్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. గ్రామానికి చెందిన నజీర్‌ఉసేన్, మహ్మద్, సాయికిరణ్, సుందర్‌రాజ్, మహబూబ్ బాష, సుబ్బరాయుడు, రాజు,పెద్ద న్న, దావీదుతో పాటు మరి కొంత మంది పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, నాయకులు సుమంత్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, జాకీర్‌ఉసేన్, ఉప్పు భాస్కర్, గడ్డం సురేష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బందారు సుబ్బరాయుడు, జయచంద్రారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, టైలర్ బాష, ఎల్లగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుతో లాభాలు



నందనపల్లెలో చీని తోటను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

కర్నూలు (న్యూటౌన్): ఉద్యాన పంటల సాగుతో రైతులు లాభాలు పొందవచ్చని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం కర్నూలు మండలం నందనపల్లె గ్రామంలో చీని తోటలు, షెడ్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో 100 శాతం సబ్సిడీతో పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహం అందిస్తోందన్నారు. అతి తక్కువ ఖర్చుతో చీని, నిమ్మ, మామిడి, కొబ్బరి, సీతాఫలం, సపోట, అల్లనేరేడు, చింత, ఆపిల్ బేర్, డ్రాగన్ ఫ్రూట్, గుండు మల్లెలు, గులాబీ పూల సాగు చేపట్టవచ్చని వివరించారు. ప్రభుత్వం కల్పించిన సువర్ణ అవకాశాన్ని 5 ఎకరాల్లోపు రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల ఇంజనీర్ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష సర్వేను పకడ్బందీగా చేపట్టండి



జగనన్న ఆరోగ్య సురక్షను ప్రారంభిస్తున్న ఎంపీపీ బొంతల మునెప్ప, అధికారులు

సి.బెళగల్: ఆరోగ్య సురక్ష సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీపీ బొంతల మునెప్ప వలంటీర్లు, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ నిర్వహణపై మండల స్థాయి అధికారులు, వైద్యులు, గ్రామ వలంటీర్లు, వైద్య సిబ్బందికి అవగాహనను కల్పించారు. శనివారం నుంచి వైద్య సిబ్బంది సర్వేను పూర్తి స్థాయిలో నిర్వహించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్, పోలకల్ పీహెచ్‌సీ డాక్టర్ హరిచంద్రుడు వైద్య అధికారులకు, సిబ్బందికి సూచించారు. అనంతరం అధికార యంత్రాంగం గ్రామంలోని వీధులలో వలంటీర్లు చేపట్టిన ఆరోగ్య సురక్ష సర్వేను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సునీల్ రాణి ఉన్నారు.

పరిసరాల శుభ్రతకు సహకరించాలి



అలమూరులో ర్యాలీలో పాల్గొన్న డీఎల్‌పీఓ రాంబాబు

పాణ్యం: పరిసరాల శుభ్రతకు అందరూ సహకరించాలని నంద్యాల డీఎల్‌పీఓ రాంబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆలమూరు గ్రామంలో 'స్వచ్ఛతే సేవా, జగనన్న సురక్ష' కార్యక్రమాలు చేపట్టారు. పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ర్యాలీకి సర్పంచ్ ముల్ల మహ్మద్ షరీఫ్, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, పంచాయతీ, వైద్య, సచివాలయ సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ శుభ్రత పాటించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే తడి, పొడి చెత్తను వేరుచేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలన్నారు.

సర్వే పక్కాగా చేపట్టండి

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను వైద్య సిబ్బంది పక్కాగా చేపట్టాలని డీఎల్‌పీఓ సూచించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, విషజ్వరాల బాధితులకు సురక్ష శిబిరాల ద్వారా వైద్య సేవలు అందించేలా చూడాలన్నారు

డ్రైడే..ఫ్రైడే

ప్రతి గ్రామంలో డ్రైడే.. ఫ్రైడే కార్యక్రమాన్ని తప్పకుండా అమలు చేయాలని డీఎల్‌పీఓ సూచించారు. డ్రైనేజీల్లో మురుగు నిల్వ ఉండకుండా పారిశుద్ధ్య సిబ్బంది సకాలంలో పూడిక తొలగించాలన్నారు. నీటి కుంటల్లో దోమలు వృద్ధి చెందకుండా వేస్ట్ ఆయిల్ చల్లాలన్నారు. అలాగే ఫాగింగ్ చేయాలన్నారు.డ్రమ్ములు, తొట్టెల్లో నీరు ఎక్కువకాలం నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈఓఆర్డీ భాస్కర్‌రావు, గ్రామ కార్యదర్శి నాగమణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి వడ్డాణం బహూకరణ



సుంకులమ్మ గుడి చైర్మన్‌కు వెండి వడ్డాణం అందిస్తున్న దాత అయ్యన్న, నాగశిరీష దంపతులు

గూడూరు రూరల్: కె.నాగలాపురంలోని గ్రామదేవత శ్రీ సుంకులాపరమేశ్వరీ దేవికి శుక్రవారం కల్లూరు మండలం లొద్దిపల్లె గ్రామానికి చెందిన దాత అయ్యన్న, నాగ శిరీష దంపతులు వెండి వడ్డాణాన్ని బహూకరించారు. అమ్మవారి మొక్కులో భాగంగా దాత అయ్యన్న 110 గ్రాముల వెండితో ప్రత్యేకంగా తయారు చేయించిన వడ్డాణాన్ని ఆలయ చైర్మన్ ఉమామహేశ్వరమ్మ, వైస్ చైర్మన్ లక్ష్మన్నలకు అందించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ.. దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయ, సహకారాలను అందించాలన్నారు. భక్తులు అమ్మవారికి ఇచ్చే కానుకలకు సంబంధించి రసీదును తప్పనిసరిగా పొందాలన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు కల్చరల్: విద్యుత్ పురోగతి పనులు, మరమ్మతుల నిర్వహణలో భాగంగా శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ కర్నూలు డివిజన్ డీఈఈ రాజమోహన్‌రెడ్డి తెలిపారు. 33కేవీ ఫీడర్, 11కేవీ ఫోర్త్‌క్లాస్ ఫీడర్ల పరిధిలోని గణేష్‌నగర్, సాయి విజయ్ కాలనీ, రెవెన్యూకాలనీ, పార్థసారథిర్స్, శ్రీవారి కుటీర్, జొహరాపురం రోడ్, నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీ, రామ్‌న గర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అవసరం ఉన్నచోట ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను లబ్ధిదారుడికి అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని వర్కూరు ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. మంచినీళ్లు బాగోలేవని, కొత్త పైపులైన్ వేయాలని, మురుగునీటి కాల్వలు నిర్మించాలని, టీడీపీ పాలనలో నిర్మించుకున్న ఇళ్లకు బిల్లులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించాలి

కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్న జగనన్నను ప్రజలంతా మరోసారి ఆశీర్వదించి గెలిపించుకోవాలని ఎమ్మెల్యే సుధాకర్ కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక టీడీపీ నేతలు లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల ఇంటి వద్దనే ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, ఏవైనా అనారోగ్య సమస్యలుంటే స్పెషలిస్ట్ డాక్టర్ల చేత వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎస్‌ఐ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్, స్థానిక నేతలు అద్దుగల రాజశేఖరరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, లాయర్ ప్రభాకర్, అయ్యప్ప పాల్గొన్నారు.

నివాళి..

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు చిన్న నాగన్న గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ శుక్రవారం గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యకర్తలు ఉన్నారు.

'ఆరోగ్య సురక్ష' సద్వినియోగం చేసుకోండి

గూడూరు రూరల్: ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని, ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సుధాకర్ పేర్కొన్నారు. కె.నాగలాపురంలో శుక్రవారం ఆరోగ్య సురక్షపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతను ఇస్తూ ప్రభుత్వం ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కింద గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసే ప్రక్రియను చేపట్టనుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీడీఓ మాధవీలత, సుంకులమ్మ గుడి చైర్మన్ ఉమామహేశ్వరమ్మ, కార్యదర్శి సౌందర్య, అజీమున్నిసా పాల్గొన్నారు.



కె.నాగలాపురంలో సురక్ష కార్యక్రమంపై మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కొత్త పింఛన్లు పంపిణీ



కొత్తగా పింఛన్లు పొందిన లబ్ధిదారులతో సర్పంచ్, నాయకులు

గడివేముల: మండల పరిధిలోని మంచాలకట్ట గ్రామంలో 26 మందికి కొత్తగా మంజూరైన పింఛన్లను సర్పంచ్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు అనిల్‌కుమార్ రెడ్డి, మేఘనాథ రెడ్డి పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక సచివాలయంలో లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అందరికీ ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వృద్ధులు, వితంతు, వికలాంగులకు పింఛన్లను మంజూరు చేసిందన్నారు. పంచాయతీ కార్యదర్శి రంగారెడ్డి, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయండి

వెల్దుర్తి: కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని 74 చెరువులను హంద్రీనీవా నీటితో నింపేందుకు కృష్ణగిరి మండలంలోని లక్కసాగరం వద్ద ఏర్పాటు చేసిన పంప్‌హౌస్ ప్రారంభోత్సవానికి ఈనెల 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రానున్నారని, అనంతరం డోన్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తారని ప్రజలు, రైతులు విజయవంతం చేయాలని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమె స్థానిక ఎంపీపీ కార్యాలయంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సీఎం పర్యటన విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



హుసేనాపురంలో పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ఓర్వకల్లు: పత్తి సాగు చేసిన రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కర్నూలు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ అన్నారు. శుక్రవారం సుజాతమ్మతో పాటు, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఓలు శశిధర్ రెడ్డి, సుధాకర్ కలిసి క్షేత్రస్థాయిలో పొలాలను సందర్శించారు. హుసేనాపురం గ్రామ రైతులు సాగుచేసిన పత్తి పంటలను పరిశీలించారు. పత్తిలో రసం పీల్చే పురుగు ఆశించినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో పత్తిలో ప్రధానంగా రసం పీల్చే పురుగులైన పచ్చదోమ, తామర పురుగు, తెల్లదోమ విపరీతంగా ఆశించినట్లు తెలిపారు. పురుగు ఉధృతిని నివారించడానికి సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు అఫిసెట్ 1.5 గ్రాములు గానీ, ఇమిడాక్లోప్రిడ్ 1 గ్రామును లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. అక్టోబర్ మాసంలో తామర పురుగు తాకిడి అధికంగా ఉంటుందన్నారు. అందుకు పిప్రోనిక్ 2 ఎంఎల్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయడం వల్ల పంటను కాపాడుకోవచ్చన్నారు. ఉధృతి స్థాయి ని బట్టి అవసరమైన మేరకు మల్టీ-కె/13-0-45 రసాయన మందులను పైమందులతో పాటు వారం వ్యవధిలో పిచికారీ చేయాలని సూచించారు. ఏఈఓ భాస్కర్, రైతు భరోసా కేంద్రం సిబ్బంది గంగాధర్, భువనేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

భారత నిర్మాణంలో ఇంజినీర్లే కీలకం

పాణ్యం: భారతదేశ నిర్మాణంలో ఇంజినీర్లదే కీలక పాత్ర అని ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాల డీన్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం కళాశాలలో ఇంజనీర్స్ డే పురస్కరించుకుని మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ.. వందల ఏళ్ల నాటి బహుళ నిర్మాణాలు చెక్కు చెదరకుండా ఉన్నాయంటే ఇంజినీర్ల ప్రతిభకు నిదర్శమన్నారు. సీమకే తలమానికమైన గోరుకల్లు జలాశయ నిర్మాణ పనులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ప్రాజెక్టు విశేషాలను జేఈ అమృత్‌సాగర్ వివరించారు.అలాగే శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో మోక్షగుండ విశ్వేశ్వరయ్య జయంతిని ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు.

గణేష్ మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

కర్నూలు: వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించి ఉత్సవాలను నిర్వహించేవారు పోలీసు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని మూడో పట్టణ సీఐ మురళీధర్ రెడ్డి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. వినాయక చవితి సందర్భంగా మండపం వద్ద పాటించవలసిన నిబంధనలను, తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలను ప్రకటనలో పేర్కొన్నారు. విగ్రహ ప్రతిష్ఠ ఏర్పాటు చేసుకోవడానికి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ అనుమతి తప్పనిసరి తీసుకోవాలని, ఐదు లేదా అంతకంటే ఎక్కువమంది కమిటీగా ఏర్పడి వారి వివరాలు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో తెలిపి వారి గుర్తింపు కార్డు నకలు కాపీలు స్టేషన్‌లో అప్పగించాలని సూచించారు.